RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | సోమవారం, అక్టోబరు 26, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 168 | పేజీలు: 8 | వెల : రూ.1

టీజీఎస్ఆర్టీసీ గుడ్ న్యూస్..

రూ.600కే హైదరాబాద్‌లో వారమంతా బస్సు ప్రయాణం!

సింగరేణిని బలోపేతం చేసి భవిష్యత్తు తరాలకు ఉపాధి భద్రత కల్పించాలి: భట్టి

కొత్త గనుల అభివృద్ధి, కీలక ఖనిజాల అన్వేషణపై దృష్టి

వాయిస్ టుడే, హైదరాబాద్: సింగరేణి సంస్థను బలోపేతం చేసి, ప్రస్తుత కార్మికులతో పాటు భవిష్యత్తు తరాలకు ఉపాధి భద్రత కల్పించేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, ఉత్పాదకతను పెంచడంతో పాటు మారుతున్న ఇంధన రంగ అవసరాలకు అనుగుణంగా సంస్థను విస్తరించాలని సూచించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సింగరేణి కాలరీస్ సంస్థకు చెందిన 66 మంది జనరల్ మేనేజర్లతో నిర్వహించిన ప్రత్యక్ష సమీక్షలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. పోటీ మార్కెట్‌కు అనుగుణంగా సింగరేణిని లాభదాయక సంస్థగా తీర్చిదిద్దాలని, యంత్రాలు, మానవ వనరులను సమర్థంగా వినియోగించాలని పేర్కొన్నారు. కొత్త బొగ్గు గనుల అభివృద్ధితో పాటు బొగ్గు రవాణా, సరఫరా వ్యవస్థలను మెరుగుపరచాలని సూచించారు. బొగ్గుపై మాత్రమే ఆధారపడకుండా రాగి, బంగారం, వెనేడియం, లిథియం వంటి కీలక ఖనిజాల అన్వేషణలో అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. అంతర్జాతీయ నిపుణుల సహకారంతో ఆయా రంగాల్లో పెట్టుబడుల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని స్పష్టం చేశారు. సౌర విద్యుత్, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, పంప్డ్ స్టోరేజీ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల విస్తరణ నేపథ్యంలో భవిష్యత్తులో బొగ్గు డిమాండ్‌లో వచ్చే మార్పులను ముందుగానే అంచనా వేయాలని సూచించారు. సంస్థ అభివృద్ధికి అవసరమైన కొత్త ఆలోచనలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారాలను ప్రభుత్వానికి అందించాలని జనరల్ మేనేజర్లకు పిలుపునిచ్చారు.

రూ.2.57 కోట్లతో ధర్మపురి బస్ స్టేషన్ ఆధునీకరణ

2027 గోదావరి పుష్కరాల నాటికి పుణ్యక్షేత్రాల్లో మెరుగైన రవాణా సదుపాయాలు

డిండి లిఫ్ట్ రద్దు చేయాలి.. పాలమూరు రైతుల హక్కులను కాపాడాలి: డీకే అరుణ

పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి.. బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తాం

మహబూబ్‌నగర్: పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో డిండి లిఫ్ట్ ద్వారా నీటిని తరలించడాన్ని వ్యతిరేకిస్తున్నామని బీజేపీ నేత డీకే అరుణ స్పష్టం చేశారు. డిండి లిఫ్ట్‌ను రద్దు చేసి, పాలమూరు రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబ్‌నగర్‌లోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. డిండి ద్వారా 0.6 టీఎంసీల నీటిని తరలించే ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు అసలు లక్ష్యానికి అనుగుణంగా పనులు చేపట్టాలని, తొలి డీపీఆర్ ప్రకారం ప్రాజెక్టును సమీక్షించి పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. జీవో 72లో డిండి ద్వారా నీటిని అందించే అంశం లేదని డీకే అరుణ పేర్కొన్నారు. ప్రాజెక్టు నీటి అప్రోచ్‌ను జూరాల నుంచి శ్రీశైలం బ్యాక్‌వాటర్‌కు మార్చడంతో అసలు లక్ష్యం దెబ్బతిందని ఆరోపించారు. ప్రాజెక్టుకు కేంద్రం నుంచి నిధులు సమకూర్చే అంశంపై గతంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా మాట్లాడారని గుర్తుచేస్తూ, పనులు పూర్తి చేయడంలో జాప్యంపై ప్రశ్నించారు. నల్గొండ జిల్లాకు సాగు, తాగునీరు అందించేందుకు నక్కలగండి, నాగార్జునసాగర్, ఎస్ఎల్‌బీసీ, మల్లన్నసాగర్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఫ్లోరైడ్ సమస్యను రాజకీయాలకు ఉపయోగించుకోవద్దని, రెండు జిల్లాల రైతుల మధ్య భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా చూడాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసిన డీకే అరుణ.. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. డిండి లిఫ్ట్ రద్దు కోసం బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని, త్వరలోనే పెండింగ్ ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో సందర్శించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.

రక్షణ రంగ తయారీకి తెలంగాణను కీలక కేంద్రంగా తీర్చిదిద్దుతాం: సీఎం రేవంత్

స్వదేశీ ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం

వాయిస్ టుడే, హైదరాబాద్: భారత్ వ్యూహాత్మక స్వావలంబన సాధించాలంటే స్వదేశీ ఆవిష్కరణలు, సాంకేతిక నైపుణ్యం, అంతర్జాతీయ పోటీని తట్టుకోగల రక్షణ పరిశ్రమ అభివృద్ధి కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ జాతీయ లక్ష్య సాధనలో తెలంగాణ తన వంతు పాత్ర పోషించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. రక్షా ఎక్స్‌పో 2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా తెలంగాణను రక్షణ రంగ తయారీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయాలనే సంకల్పాన్ని పునరుద్ఘాటించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే బలంగా ఉన్న రక్షణ రంగ వ్యవస్థ, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పారిశ్రామిక సామర్థ్యాలను ఉపయోగించుకుని ప్రపంచ స్థాయి సంస్థలు, భారతీయ పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లను ఒకే వేదికపైకి తీసుకురావచ్చని పేర్కొన్నారు. రాబోయే ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0 ద్వారా ఈ రంగంలో పెట్టుబడులు, తయారీ, సాంకేతిక అభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో కీలక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వివరించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులను సీఎం ఆహ్వానించారు. స్వదేశీ రక్షణ సామర్థ్యాలను పెంపొందిస్తూ, సాంకేతిక స్వావలంబనతో దేశ భద్రతను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

నవంబర్ 1న ఛలో ఢిల్లీకి కాంగ్రెస్ శ్రేణులు కదలాలి: పొంగులేటి

ఎల్‌నినో ప్రభావంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

భద్రాద్రి కొత్తగూడెం: నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఓట్ బచావో -దేశ్ బచావో' నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యానగర్‌లో డీసీసీ అధ్యక్షురాలు దేవిప్రసన్న అధ్యక్షతన జరిగిన జిల్లా కాంగ్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎల్‌నినోపై ముందస్తు అప్రమత్తత

ఎల్‌నినో ప్రభావంతో వచ్చే ఏప్రిల్, మే నెలల్లో వాతావరణ పరిస్థితులు, నీటి ఎద్దడి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలు నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని అన్నారు.

బీఆర్ఎస్ ప్రచారాన్ని తిప్పికొట్టాలి

బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై దృష్టి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని మంత్రి కోరారు. 2023 సెప్టెంబర్ నాటికి పట్టభద్రులైన అర్హులు తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు.

ఓటు హక్కు పరిరక్షణ కోసం ఛలో ఢిల్లీ

SIR ప్రక్రియ పేరుతో ఓట్ల తొలగింపు జరుగుతోందని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై మంత్రి విమర్శలు చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ చేపడుతున్న 'ఓట్ బచావో - దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా నవంబర్ 1న ఢిల్లీలో జరిగే నిరసనకు భారీగా తరలిరావాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు తదితర నాయకులతో కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన కరపత్రాలను మంత్రి ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన సమన్వయ కమిటీల సమీక్ష

ఎన్నికల వ్యూహంపై నేతలకు నాదెండ్ల మనోహర్ దిశానిర్దేశం

వాయిస్ టుడే, మంగళగిరి: జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీల సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో జరిగిన నామినేషన్ల ప్రక్రియ, పార్టీ పోటీ చేసే ప్రాంతాల్లోని పరిస్థితులపై నాయకులు చర్చించారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సూచించిన అంశాలను, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) ఛైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కమిటీ సభ్యులకు వివరించారు. ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు సాగేందుకు అవసరమైన అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, వంశీకృష్ణ శ్రీనివాస్, బొలిశెట్టి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. నాయకులు బి. మహేందర్ రెడ్డి, ఏవీ రత్నం, కళ్యాణం శివ శ్రీనివాస్, చిలకం మధుసూదన్ రెడ్డి, చిల్లపల్లి శ్రీనివాసరావు, పాలవలస యశస్విని, వేములపాటి అజయ్ కుమార్, పి. ప్రశాంత్, పెండెం దొరబాబు, పెనుగొండ సుబ్బరాయుడు, యనమల భాస్కర్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు.

ఏపీకి తుపాను ముప్పు.. అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశం

తీరం దాటే సమయంలో 125 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం

వాయిస్ టుడే, అమరావతి: : బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం తుపానుగా బలపడే అవకాశం ఉండటంతో ఆంధ్రప్రదేశ్‌పై పడే ప్రభావం, ముందస్తు సన్నద్ధతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత అంచనాల ప్రకారం కోనసీమ-యానాం-కాకినాడ ప్రాంతంలో తుపాను తీరం దాటే అవకాశాలున్నాయని అధికారులు వివరించారు. కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలతో పాటు ఉత్తరాంధ్రలోని ఇతర ప్రాంతాలపై గాలులు, వర్షాల ప్రభావం ఉండవచ్చని అంచనా వేశారు. తీరం దాటే సమయంలో గంటకు 115-125 కిలోమీటర్ల వేగంతో గాలులు, కొన్ని సందర్భాల్లో 140 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఉదయం నుంచే తీర ప్రాంతాల్లో గాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఉత్తరాంధ్ర, మధ్య కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. సహాయక చర్యల కోసం 10 ఎన్‌డీఆర్ఎఫ్, 11 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. తుపాను ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించడం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు

సోమవారం, అక్టోబరు 26, 2026

రూ.2.57 కోట్లతో ధర్మపురి బస్ స్టేషన్ ఆధునీకరణ

2027 గోదావరి పుష్కరాల నాటికి పుణ్యక్షేత్రాల్లో మెరుగైన రవాణా సదుపాయాలు

వాయిస్ టుడే, జగిత్యాల: జగిత్యాల జిల్లా ధర్మపురి బస్ స్టేషన్‌ను రూ.2.57 కోట్లతో ఆధునీకరించే పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. సహచర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 1993లో ప్రారంభమైన బస్ స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనుల్లో భాగంగా రెండు ప్లాట్‌ఫారాల విస్తరణ, గ్రానైట్ ఫ్లోరింగ్, కొత్త టాయిలెట్ బ్లాక్, సీసీ పేవ్‌మెంట్‌తో పాటు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు భక్తులకు ఇబ్బందులు కలగకుండా బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని ప్రధాన పుణ్యక్షేత్రాల బస్ స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ధర్మపురిలో బస్ డిపో ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణ చేపట్టి ప్రతిపాదనలు పంపించాలని అధికారులను కోరినట్లు తెలిపారు. ధర్మపురి నుంచి ముంబైకి బస్సు సర్వీసు, కరీంనగర్--జగిత్యాల--ధర్మపురి మధ్య రాత్రి బస్సుల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలు 367 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు చేసి, దాదాపు రూ.13 వేల కోట్లు ఆదా చేసుకున్నారని తెలిపారు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు చేరేలా, ప్రయాణికులకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ సేవలను విస్తరిస్తూ ధర్మపురి ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు వెల్లడించారు.

మున్సిపల్ ఎన్నికల్లో జనసేన బలంగా పోటీ చేస్తుంది: శంకర్‌గౌడ్

ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు సిద్ధం కావాలి

వాయిస్ టుడే, హైదరాబాద్: తెలంగాణలో రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ బలంగా పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కూకట్‌పల్లిలోని జనసేన కార్యాలయంలో రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన +ఎవీజ, వీవీజ, జవీజ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న వారికి రానున్న ఎన్నికల్లో సముచిత ప్రాధాన్యం లభిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే నాయకులు, అభ్యర్థులు నిరంతరం ప్రజలతో మమేకమై స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు, పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్ మాట్లాడుతూ ప్రతి నాయకుడు తమ డివిజన్‌లో పార్టీని బలోపేతం చేసుకుంటూ, ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పలువురు కీలక నాయకులు జనసేనలో చేరుతున్నారని, స్థానికంగా పార్టీని బలోపేతం చేసే నాయకులకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రాదరాం రాజలింగం, దామోదర్ రెడ్డి, మచ్చా సుధాకర్, మేడ రామకృష్ణ, మండపాక కావ్య, నిహారికతో పాటు జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

కొరియా పెట్టుబడులతో తెలంగాణలో ఉద్యోగాలు, సాంకేతికాభివృద్ధికి ప్రాధాన్యం

కె-హార్మనీ ఫెస్టాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వాయిస్ టుడే, హైదరాబాద్: కొరియా సంస్థల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు తెలంగాణ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఆధునిక తయారీ, లైఫ్ సైన్సెస్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో తెలంగాణ--కొరియా భాగస్వామ్యానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఆదివారం నిర్వహించిన కె-హార్మనీ ఫెస్టా -- కొరియా కల్చర్ డే 2026 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఈ మేరకు ప్రసంగించారు. 2024 ఆగస్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా జరిగిన పెట్టుబడుల చర్చలను గుర్తుచేస్తూ, రెండు ప్రాంతాల మధ్య ఆర్థిక, పారిశ్రామిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. తెలంగాణ పర్యాటక విధానం 2025--2030లో భాగంగా రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, అదనంగా మూడు లక్షల ఉపాధి అవకాశాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పర్యాటక మౌలిక వసతులు, ఆతిథ్య రంగం, చలనచిత్ర పర్యాటకం, వెల్‌నెస్ టూరిజం, సాంస్కృతిక రంగాల్లో కొరియా సంస్థలు పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. పరిశ్రమలతో పాటు విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు, చిన్న పరిశ్రమల మధ్య పరస్పర సహకారం పెరగాలని ఆకాంక్షించారు. బతుకమ్మ, బోనాలు, చార్మినార్, గోల్కొండ కోట, రామప్ప దేవాలయం, బుద్ధవనం వంటి తెలంగాణ సాంస్కృతిక, చారిత్రక సంపదను అంతర్జాతీయ స్థాయిలో మరింతగా పరిచయం చేయాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

సన్న బియ్యం సరఫరాలో మోసం.. 14 మంది రైస్ మిల్లర్లను అరెస్ట్ చేసిన సీఐడీ

ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరాలో అక్రమాలు

సన్న బియ్యం స్థానంలో దొడ్డు బియ్యం సరఫరా చేసినట్లు ఆరోపణలు

నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లో వెలుగుచూసిన మోసం

ప్రభుత్వానికి రూ.1.69 కోట్ల నష్టం వాటిల్లినట్టు అంచనా

తెలంగాణలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు బియ్యం సరఫరా చేసే ప్రక్రియలో భారీ అక్రమాలకు పాల్పడిన 14 మంది రైస్ మిల్లర్లను రాష్ట్ర నేర పరిశోధన విభాగం (సీఐడీ) అరెస్ట్ చేసింది. 2025--26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నిబంధనల ప్రకారం 'సన్న రకం' బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉండగా, వాటి స్థానంలో నాసిరకం 'దొడ్డు బియ్యాన్ని' అందజేసినట్లు వీరిపై అభియోగాలు నమోదయ్యాయి. పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్) ఈ నెల 24న అందజేసిన ఫిర్యాదు మేరకు సీఐడీ దర్యాప్తు చేపట్టింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమకు కేటాయించిన సన్న రకం ధాన్యాన్ని మిల్లర్లు బహిరంగ మార్కెట్లో విక్రయించుకుని, అందుకు బదులుగా ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు సేకరించిన దొడ్డు బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించినట్లు అధికారులు గుర్తించారు. సేకరించిన నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించగా, అవి నిర్దేశిత సన్న రకం బియ్యం కాదని నిర్ధారణ అయ్యింది. నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని 16 రైస్ మిల్లులు సన్న బియ్యానికి బదులుగా సుమారు 3,385 టన్నుల దొడ్డు బియ్యాన్ని సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది. దీనివల్ల ప్రభుత్వానికి బోనస్ రూపంలో సుమారు రూ.1.69 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి బియ్యం సేకరణను నిలిపివేయడంతో సుమారు రూ.242 కోట్ల మేర జరగాల్సిన భారీ ఆర్థిక నష్టాన్ని నివారించగలిగారు. ఈ ఉదంతంపై మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసిన సీఐడీ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. బియ్యం మళ్లింపు, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఒప్పంద నిబంధనల ఉల్లంఘన, క్రిమినల్ కుట్ర వంటి సెక్షన్ల కింద విచారణ జరుపుతున్నారు. ఈ కుంభకోణంలో ఎవరైనా ప్రభుత్వ అధికారుల ప్రమేయం ఉందా అనే కోణంలోనూ ఆరా తీస్తున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మైనారిటీ నేత జిబ్రాన్ షరీఫ్

కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు..

వాయిస్ టుడే, హైదరాబాద్: ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ సీనియర్ నాయకుడు జిబ్రాన్ షరీఫ్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో తన అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ సీని యర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పా లని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, మైనారిటీల సంక్షేమానికి రూ.4,000 కోట్ల బడ్జెట్, ఆసరా పెన్షన్ల పెంపు, రైతు భరోసా వంటి హామీల అమలుపై ప్రశ్నించారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్షాలపై కేసులు పెట్టి భయపెట్టడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. తెలంగాణను గతంలో కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్, తాగునీరు, మౌలిక సదుపాయాల రంగాల్లో అభివృద్ధి చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మత సామరస్యాన్ని కాపాడేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై విమర్శలు చేసిన కేటీఆర్, తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని అన్నారు. 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. జిబ్రాన్ షరీఫ్ చేరికతో ఖైరతాబాద్ నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, తలసాని సాయికిరణ్ యాదవ్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండే

వాయిస్ టుడే, హైదరాబాద్: ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నాయకుడు, మాజీ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండే తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

టీజీఎస్‌ఆర్టీసీ గుడ్ న్యూస్.. రూ.600కే హైదరాబాద్‌లో వారమంతా బస్సు ప్రయాణం!

హైదరాబాద్ ప్రయాణికుల కోసం టీజీఎస్‌ఆర్టీసీ కొత్త వీక్లీ పాస్

రూ.600 చెల్లిస్తే వారం రోజుల పాటు అన్‌లిమిటెడ్ ప్రయాణం

ఏసీ బస్సులతో సహా అన్ని సిటీ బస్సుల్లోనూ ఈ పాస్ చెల్లుబాటు

ఎయిర్‌పోర్ట్ పుష్పక్ సర్వీసులకు మాత్రం మినహాయింపు

అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో ఈ పాస్ అందుబాటులో!

హైదరాబాద్ నగరంలో బస్సుల్లో ప్రయాణించే వారికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఒక శుభవార్త అందించింది. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్తగా అన్‌లిమిటెడ్ బస్ పాస్‌ను ప్రవేశపెట్టింది. కేవలం రూ.600 చెల్లించి ఈ పాస్‌ను పొందడం ద్వారా ఏడు రోజుల పాటు నగరంలో అపరిమితంగా ప్రయాణించవచ్చు. ఈ కొత్త పాస్ కొనుగోలు చేసిన తేదీ నుంచి వరుసగా ఏడు రోజుల పాటు చెల్లుబాటులో ఉంటుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో తిరిగే ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్ బస్సులతో పాటు ఏసీ బస్సుల్లోనూ ఈ పాస్‌తో ప్రయాణించేందుకు అనుమతి ఉంటుందని టీజీఎస్ఆర్టీసీ స్పష్టం చేసింది. అయితే, శంషాబాద్ విమానాశ్రయానికి నడిచే పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్ సర్వీసులకు మాత్రం ఈ పాస్ వర్తించదని అధికారులు తెలిపారు. ప్రయాణికులపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు, బస్సు ప్రయాణాన్ని మరింత సులభతరం చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు వివరించారు. ఈ కొత్త పాస్‌లు నగరంలోని అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో అందుబాటులో ఉంటాయని వారు పేర్కొన్నారు. తరచూ బస్సుల్లో ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ఈ పాస్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

రానున్న మున్సిపల్ ఎన్నికలకు జనసేన శ్రేణులు సిద్ధం కావాలి: నేమూరి శంకర్ గౌడ్

ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలపై పోరాడాలి.. కష్టపడిన వారికి పార్టీలో సముచిత గుర్తింపు: ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

కూకట్‌పల్లి, అక్టోబర్ 25(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్రంలో రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు సిద్ధం కావాలని రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. కూకట్‌పల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్, జనసేన జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణలో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ బలంగా పోటీ చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి తగిన గుర్తింపు, సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు ప్రజలతో మమేకమై స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. వార్డులు, డివిజన్ల స్థాయిలో కమిటీలను బలోపేతం చేస్తూ ఎన్నికల ప్రణాళికలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్ మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, ఆశయాల పట్ల ఆకర్షితులై ప్రజలు, నాయకులు జనసేన వైపు చూస్తున్నారని తెలిపారు. ప్రతి నాయకుడు తన డివిజన్‌లో పార్టీ బలాన్ని పెంచుకోవడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా కీలక నాయకులు జనసేన పార్టీలో చేరుతున్నారని తెలిపారు. డివిజన్ స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, ప్రజల్లో ఆదరణ పొందిన నాయకులుగా ఎదగాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో స్థానికంగా ప్రజాదరణ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కొత్త నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తూ జనసేనను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర నాయకుడు మచ్చా సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై అవగాహన పెంచుకుని పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధం కావాలని అన్నారు. రిజర్వేషన్ల కోసం ఎదురుచూడకుండా, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేలా ప్రతి డివిజన్‌లో పార్టీ క్యాడర్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ కమిటీలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.

ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రామకృష్ణ, రాదరాం రాజలింగం, దామోదర్ రెడ్డి, కావ్యతో పాటు జీహెచ్‌ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధులకు చెందిన జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 25(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శ్రీ శంభీపూర్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప దీక్షాదారుల కోసం నుండి డిసెంబర్ 20 వరకు ఏర్పాటు చేసిన మహా అన్న సమారాధన (నిత్య అన్నదాన) కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోలన్ చంద్ర శేఖర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కౌన్సిలర్ నాచారం మురళి యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు ఉంగరాల శ్రీనివాస్, ఇంద్రకుమార్ దేవ్, సతీష్, హరిబాబు, 125 డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ రామ్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు అభిషేక్ రెడ్డి, అయ్యప్ప స్వామి భక్తులు, దీక్షాదారులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ పిలుపు

– కరీంనగర్ సమావేశంలో కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 25(వాయిస్ టుడే): ఏఐసీసీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన "ఓట్ బచావో -- దేశ్ బచావో" కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్ , ఏఐసీసీ పరిశీలకులు ఎస్. శరత్ కలిసి పాల్గొన్నారు..టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ సూచనల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో ఓటు హక్కు పరిరక్షణ, ప్రజల్లో అవగాహన కల్పించడం, నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి జన సమీకరణ, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మనకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ , మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబు, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్, ఆల్‌ఫోర్స్ నరేందర్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డా. సత్యం శ్రీరంగం ఏకగ్రీవ ఎన్నిక

26 జిల్లాల ప్రతినిధుల మద్దతుతో నూతన కార్యవర్గం ఏర్పాటు.. రాష్ట్రంలో త్రోబాల్ క్రీడాభివృద్ధికి కృషి

కూకట్‌పల్లి, అక్టోబర్ 25(వాయిస్ టుడే): తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా చిత్ర శనాయి, కోశాధికారిగా భాస్కర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎరోస్ త్రోబాల్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశానికి త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పరిశీలకుడు అమన్ శర్మ హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా మాజీ కేంద్ర మంత్రి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సముద్రాల వేణుగోపాలాచారి, సీనియర్ న్యాయవాది మోక్షజ్ఞ పాల్గొన్నారు. తెలంగాణలోని 26 జిల్లాలకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రతినిధులు సమావేశంలో పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం తనపై విశ్వాసం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్న జిల్లా ప్రతినిధులు, అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో త్రోబాల్ క్రీడను మరింత అభివృద్ధి చేయడం, యువ క్రీడాకారులను ప్రోత్సహించడం, రాష్ట్ర క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేలా అవసరమైన అవకాశాలు కల్పించడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 26 జిల్లాల ప్రతినిధులతో పాటు కృష్ణ రాజ్‌పుత్, శ్రీరామోజు శివకుమార్, ఓదెలు యాదవ్, వడ్డెన్న, రవి, అనిల్, వినీషా, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున నగర్ కమ్యూనిటీ హాల్లో ఎమ్మెల్సీ ఓటర్ ఎన్ రోల్ మెంట్ క్యాంప్

నాచారం (వాయిస్ టుడే):హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ ఎన్ రోల్ మెంట్ కు తార్నాకలోని నాగార్జున నగర్ కమ్యూనిటీ హాల్లో ఎన్ రోల్ మెంట్ క్యాంప్ ను ఏర్పాటు చేశారు. అసోసియేషన్ కోరిక మేరకు స్థానిక బిజెపి నాయకులు బండ శివారెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రులైన వారందరూ ఈ ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ కోరారు. వచ్చే నెల నవంబర్ 6 వరకు ఈ హెల్ప్ డెస్క్ సేవలు కొనసాగుతాయనీ తెలిపారు. ప్రధానంగా సీనియర్ సిటిజన్స్ ఈ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సంధ్యారాణి, ప్రేమలత, బిజేపి రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, డా. పి. మోహన్ రావు, రామ్మోహన్ రెడ్డి, వేణు, బండ శివారెడ్డి, వీరన్న, రాము, సతీష్ రెడ్డి, సుబ్బారావు తదితరులున్నారు.

హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, విజయ డయాగ్నోస్టిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో సి.ఎం.ఈ. కార్యక్రమం

హైదరాబాద్: అక్టోబర్ 25;(వాయిస్ టూ డే): హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, విజయ డయాగ్నోస్టిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సి.ఎం.ఈ.) కార్యక్రమం హిమాయత్‌నగర్‌లోని జూపల్లి బాలమ్మ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. హోమియోపతి చికిత్స ద్వారా ప్రయోజనం పొందిన శ్రీమతి రాజ్ రాణి కపూర్ స్మృతికి ఈ కార్యక్రమాన్ని అంకితం చేశారు. రాజ్ రాణి కపూర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ మ్యాట్ అధ్యక్షుడు డా. కె. గోపాలకృష్ణ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా. జి. దుర్గాప్రసాద్ రావు మాట్లాడుతూ, హెచ్ మ్యాట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య, సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ నెల నుంచి ప్రతి నెల చివరి శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అనుభవజ్ఞులైన హోమియో వైద్యులచే ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా విజయ డయాగ్నోస్టిక్స్ బయోకెమిస్ట్ డా. అఫ్రోజ్ హనీఫ్ 'డీకోడింగ్ ది సెల్యులార్ విస్పర్స్' అనే అంశంపై ప్రసంగించారు. కరీంనగర్‌కు చెందిన హోమియో వైద్యుడు డా. మణిద్రుపద్ 'క్లినికల్ కేసెస్ అండ్ ఇన్‌సైట్స్ ఇంటూ రెమెడీ ప్యాటర్న్స్' అనే అంశంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. వైద్య రంగంలో తాజా పరిజ్ఞానాన్ని తెలుసుకోవడంతో పాటు, క్లినికల్ అనుభవాలను పంచుకునేందుకు ఇటువంటి సి.ఎం.ఈ. కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాన్ని హెచ్ మ్యాట్‌తో కలిసి నిర్వహించేందుకు సహకరించిన విజయ డయాగ్నోస్టిక్స్ చైర్మన్ డా. ఎస్. సురేందర్ రెడ్డి, సీఈఓ సుప్రిత రెడ్డిలకు అసోసియేషన్ అధ్యక్షుడు డా. కె. గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి డా. జి. దుర్గాప్రసాద్ రావు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హెచ్ మ్యాట్ తరఫున కార్యక్రమ స్పాన్సర్ రాజ్ కిషోర్ కపూర్ చారిటీస్ మేనేజింగ్ ట్రస్టీ వై.ఎస్.వి. ప్రసాద్‌తో పాటు విజయ డయాగ్నోస్టిక్స్ మార్కెటింగ్ బృందానికి చెందిన టి. రాఘవేంద్ర, టి. విజేందర్ సింగ్, టి. మల్లికార్జున్ రెడ్డి, ఎ.ఎస్. అరుణ్ కుమార్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు, హోమియోపతి వైద్యులు, వైద్య విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ ట్రాక్ సైక్లింగ్ పోటీల్లో తెలంగాణ సత్తా చాటాలి

క్రీడాకారులకు జెర్సీలు అందజేసిన రాష్ట్ర సైక్లింగ్ సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి

నాచారం (వాయిస్ టుడే): జాతీయ స్థాయి ట్రాక్ సైక్లింగ్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు ప్రతిభ చాటి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని రాష్ట్ర సైక్లింగ్ సంఘం అధ్యక్షుడు పి. మల్లారెడ్డి ఆకాంక్షించారు. ఈ నెల 30 నుంచి నవంబరు 4 వరకు ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరగనున్న 78వ సీనియర్, 55వ జూనియర్, 41వ సబ్ జూనియర్ జాతీయ ట్రాక్ సైక్లింగ్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ బాలబాలికల జట్టుకు సంఘం తరఫున ఆయన జెర్సీలను అందజేశారు.

ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో పాటు నిరంతర సాధన అవసరమన్నారు. రాంచీలో జరిగే పోటీలు క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి అవకాశమని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. తెలంగాణ జట్టుకు శుభాకాంక్షలు తెలిపి, పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాట్స్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జి. చంద్రారెడ్డి, అంతర్జాతీయ సైక్లిస్ట్ మ్యాక్స్‌వెల్ ట్రెవర్, రాష్ట్ర సైక్లింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి విజయ్‌కాంత్ రావు, కోచ్‌లు విజయ్ భాస్కర్‌రెడ్డి, పాండు జాదవ్, ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

బండారి లేఔట్ డివిజన్‌లో పట్టభద్రుల ఓటు నమోదు అవగాహనా సదస్సు

అర్హులైన పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కావాలి కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 25(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బండారి లేఅవుట్ డివిజన్,పూజిత ఎంక్లేవ్ లో హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటు నమోదు అవగాహనా సదస్సు బండారి లేఔట్ డివిజన్ అధ్యక్షులు వరగాని వాసు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హాజరయ్యారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పట్టభద్రులు ఓటరు నమోదుపై అవగాహన పెంచుకోవడంతో పాటు, ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు.రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సామ రామ్ మోహన్ రెడ్డి ఓటు వేసి, ప్రజాస్వామ్య పరిరక్షణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని హన్మంత్ రెడ్డి కోరారు ఈ కార్యక్రమం నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి,డివిజన్ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి నన్నపనేని యశోద దేవి, మురళి, ఆలేటి శ్రీనివాస్ రావు,మౌళేశ్వర్ రావు, రాయల దీపక్ సిద్దనోల సంజీవ్ రెడ్డి, పూజిత ఎంక్లేవ్ అసోసియేషన్ సభ్యులు,కాలనీ వసూలు, తదితరులు పాల్గొన్నారు.

వెన్నెలగడ్డ చెరువును ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా మార్చేందుకు అవగాహన కార్యక్రమం

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 25(వాయిస్ టుడే): పింకేష్ కుమార్ ఐఏ ఎస్ ,కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ , సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తో కలిసి జీడిమెట్ల విలేజ్ లో ఉన్న వెన్నెలగడ్డ చెరువు ప్లాస్టిక్ రహిత ప్రదేశంగా మార్చడానికి ఏఎస్ ఈ జ్ డబల్యూ హెచ్ ఓ , బ్లూ ఓసెన్ ప్రాజెక్ట్ వారిచే, ప్లాస్టిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బ్లూ ఓసెన్ ప్రాజెక్ట్ వారిచే మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిం చడం జరిగినది, స్వచ్ఛమైన నీరు, ఆరోగ్యకరమైన భూమి, ఉజ్వలమైన రేపటి రోజు వండి ఆశయాలతో వెన్నెలగడ్డ చెరువు ప్లాస్టిక్ రహిత ప్రదేశంగా మార్చడానికి కార్యక్రమం నిర్వహిం చడం జరిగినది ఈ కార్యక్రమంలో జీడిమెట్ల సర్కిల్ ఉప కమిషనర్ డి శంకర్ సింగ్ , సంస్థ ప్రతినిధులు మరియు సిబ్బంది పాల్గొన్నారు, శ్రీ. మహేందర్, యూ. బి.డి మేనేజర్ ,దుర్గా ప్రసాద్, డే ఈ ఈ , శివ ప్రకాష్ డే .ఈ ఈ (ఎస్ డబ్ల్యు ఎం), కుమారి సాయి నికితాసేన్, ఏ ఈ ఈ , మరియు లోకల్ ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు, కుత్బుల్లాపూర్ జోనల్ మరియు సర్కిల్ సిబ్బంది హాజరు అయ్యారు.

వాయిస్
హైదరాబాద్
సోమవారం 26 అక్టోబరు 2026

కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మైనారిటీ నాయకుడు జిబ్రాన్

హైదరాబాద్: ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ నాయకుడు జిబ్రాన్ ఆదివారం సాయంత్రం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు ఆబిద్ రసూల్ ఖాన్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, తలసాని సాయి యాదవ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎంపీ వద్దిరాజును సన్మానించిన మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ

హైదరాబాద్: మహర్షి వాల్మీకి రచించిన రామాయణ మహాకావ్యం సంస్కృత సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించిందని, ఆయనను ఆదికవిగా కీర్తిస్తారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం రవీంద్రభారతిలో మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలగేయ బ్రహ్మ గద్వాల సోమన్న రచించిన 'మంజూష' పుస్తకాన్ని ఆంధ్ర యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్, వాల్మీకి బోయ కార్పొరేషన్ ఛైర్మన్ గట్టు తిమ్మప్ప తదితరులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ రవిచంద్రను సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ వీడీ రాజగోపాల్, అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ రావు తదితరులు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి గొప్పతనాన్ని చాటిచెప్పే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

యూత్ లిటరరీ ఫెస్ట్ - బుద్ధ వనంలో శ్రీ శ్రీ మార్గం ఆవిష్కరణ

భద్రాచలం, అక్టోబర్ 25 : తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు బుద్ధవనం నాగార్జునసాగర్ లో నిర్వహించిన యూత్ లిటరరీ ఫెస్ట్ జయప్రదమైంది. ఈ కార్యక్రమం లో భాగం గా ఇదే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ప్రచురించిన అంతరాష్ట్ర శతాధిక కవితా సంకలనం... శ్రీ శ్రీ మార్గం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతోజు మోహనకృష్ణ సభాధ్యక్షులుగా, ముఖ్య అతిథి గా కె. ఆనందా చారి పాల్గొన్నారు. ఈ సభలో ప్రముఖ కవి సాహిత్య విమర్శకులు సీతారాం, వీ బీ కే.స్వామి శ్రీ శ్రీ మార్గం కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. శ్రీ శ్రీ మార్గం పుస్తక సంపాదకులు, తెలంగాణ సాహితి, భద్రాచలం శాఖ అధ్యక్షుడు తాతోలు దుర్గాచారి ని అభినందించారు. యువ కవులు, రచయితల కోసం బుద్ధవనం లో రాష్ట్ర కమిటీ వినూత్నంగా రెండు రోజుల పాటు నిర్వహించిన యూత్ లిటరరీ ఫెస్ట్ -2026.కి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు రెండు వందల మంది యువ కవులు రచయితలు పాల్గొన్నారు. సాహితీ యాత్ర లో పాల్గొని ప్రతిభ చాటిన భద్రాద్రి కవులు కాలం సాయి కుమారి, బొల్లు రాజ్యలక్ష్మి లను పలువురు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

రాయికల్(వాయిస్‌టుడే): రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఆదివారం రోజున జగిత్యాల పట్టణంలోని గంగారాం చర్మ వ్యాధుల దావఖాన ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వార్డు సభ్యులు అనుమల్ల రాజు కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ వైద్య శిబిరానికి దాదాపు ఒక 150 మంది పేషెంట్లకు ఉచిత కన్సల్టేషన్ మరియు మందులు పంపిణీ చేసినట్టు డెర్మటాలజిస్ట్ డాక్టర్ యేనగందుల నరేష్, గైనకాలజిస్ట్ శుభాంగి తెలిపారు ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ........ చర్మవ్యాధి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు చర్మ వ్యాధి సమస్యలు వచ్చినట్టయితే సొంతంగా వైద్యం చేసుకోవద్దని డాక్టర్ ను సంప్రదించాలని సూచించారు.మా దావఖానలో నిరుపేదలో నిరుపేదలు వైద్యం చేయించుకున్నట్లయితే వారికి ప్రత్యేక రాయితీ కల్పిస్తామని పేర్కొన్నారు.

దేశ రక్షణ, ధర్మ పరిరక్షణ కోసం మహాయజ్ఞం

పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక హోమాలు.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి: పుష్పగిరి పీఠాధిపతి

నాచారం (వాయిస్ టుడే): హైదరాబాద్ నాచారం మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ గార్డెన్‌లో దేశ రక్షణ, ధర్మ పరిరక్షణ సంకల్పంతో మూడు రోజుల పాటు మహాయజ్ఞం నిర్వహించారు. హిందూ ధర్మ చక్రం వ్యవస్థాపకులు మద్దికుంట్ల శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక యజ్ఞ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీ జగద్గురు పుష్పగిరి పీఠాధీశ్వరులు శ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతి స్వామివారు మాట్లాడుతూ.. దేశ రక్షణ, ధర్మ పరిరక్షణ కోసం రుద్ర, చండీ, అరుణ హోమాలతో పాటు లలితా సహస్రనామ హోమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పౌర్ణమి సందర్భంగా చేపట్టిన ఈ యజ్ఞం ద్వారా దేశానికి శాంతి, సుభిక్షం కలగాలని సంకల్పించినట్లు పేర్కొన్నారు. ధర్మ పరిరక్షణ, దేశ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

బొల్లె చిన్నయ్యకు గౌరవ డాక్టరేట్ పురస్కారం

రాయికల్ (వాయిస్ టుడే): విద్యారంగంలో 31సంవత్సరాలుగా విద్యార్థులకు విద్యాబోధన విశిష్ట సేవలు అందిస్తూ ,విద్యార్థుల ఉన్నతికి పాటుపడుతూ,విద్యార్థులలో విద్యా నైపుణ్యం పెంచి పాఠశాలలో డ్రాపౌట్ లు తగ్గిస్తూ,పాఠశాలల్లో విద్యార్థుల చేరికలకు సహకరిస్తున్న ,పలు సామాజిక అంశాల్లో పాల్గొంటూ,విద్యారంగానికి తనవంతు కృషి చేసినందుకు గాను ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య కు లూసియానా యూనివర్సిటీ (అమెరికా) వారు , చిన్నయ్య సేవల్ని గుర్తిస్తూ పుణె లో ఆదివారం జరిగిన అవార్డ్స్ ప్రదానోత్సవంలో బొల్లె చిన్నయ్యకు యూనివర్సిటీ అధికారుల చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ పురస్కారం ప్రదానం చేశారు. తనకుపురస్కారం రావడానికి కృషిచేసిన తెలంగాణ కో ఆర్డినేటర్ కాయితి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య గతంలో వీరి సేవలకు గాను గ్రామీణ కళాజ్యోతి,మండల ,జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా,లయన్స్ క్లబ్ జోనల్ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా, ఆంధ్ర రత్నం, బెస్ట్ సిటిజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ ఆత్మబంధువు పురస్కారాలను అందుకున్నారు. వీరికి అవార్డ్ రావడం పట్ల పి ఆర్ టి యు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తుంగూరీ సురేష్,గుర్రం శ్రీనివాస్,రాష్ట్ర నాయకులు గోవర్ధన్,విజయనందురావు,రాజు, ముక్కెర శేఖర్,జిల్లా, మండల నాయకులు గుట్ట సత్యనారాయణ, పుర్రె శ్రీనివాస్, ఆకు రమేష్, బొల్లె గంగాధర్, పెండెం విజయరాం,పల్లి రాజేందర్, కూరగాయల సురేష్, కోల రాజగోపాల్ , రమణి, ఉపాధ్యాయులు మరియు భూపతిపూర్ సర్పంచ్ గుర్రం భావన మహేందర్, ఉపసర్పంచ్ మూగల సంజీవచారి ,నాయకులు చంద్రశేఖర్, రాజేంద్ర ప్రసాద్,తదితరులు అభినందించారు.

నిరుపేదలకు చీరలు పంపిణీ

రాయికల్(వాయిస్ టుడే): రాయికల్ పట్టణంలోని సోషల్ మీడియా యాక్టర్ మహేష్ మాడల్ అలియాస్ రుద్ర వేణి మహేష్ తన పుట్టినరోజు సందర్భంగా ఆదివారం పట్టణంలోని నిరుపేదలకు చీరలు, భోజనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

న్యూ లక్ష్మీపురంలో సీసీ రోడ్లను పరిశీలించిన బీఎస్పీ రాష్ట్ర నాయకులు పల్లెపొంగు విజయ్ కుమార్

ముదిగొండ మండలం అక్టోబర్ 25 వాయిస్ టుడే : ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం గ్రామపంచాయతీ పరిధిలోని 8వ వార్డులో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను బీఎస్పీ రాష్ట్ర నాయకులు పల్లెపొంగు విజయ్ కుమార్, బీఎస్పీ పార్టీ స్థానిక 8వ వార్డు మెంబర్ పల్లెపొంగు రాజశేఖర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని, పనులు జరుగుతున్న తీరును వారు పరిశీలించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరగాలని, అంచనాల్లో పేర్కొన్న విధంగా పనులు చేపట్టాలని,సంబంధిత అధికారులు పనుల నాణ్యతను పర్యవేక్షించాలని కోరారు.

ఎంఎల్‌సీ ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలి

మక్తల్ అక్టోబర్ 25 వాయిస్ టుడే ప్రతినిధి: ముక్తల్ నియోజకవర్గం నర్వ మండల కేంద్రంలో ఎంఎల్‌సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను బీజేపీ మక్తల్ నియోజకవర్గ ఎంఎల్‌సీ ఎన్నికల ఇన్‌చార్జి డాక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో ఓటరు నమోదు ప్రక్రియను ముమ్మరం చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. ఎంఎల్‌సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పలువురికి ఎంఎల్‌సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించడంతో పాటు, పలువురి పేర్లను నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో నర్వ మండల బీజేపీ అధ్యక్షుడు అజిత్ సింహా రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి విజయ్ రామ్, జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు బొజ్జన్న, బీజేవైఎం జిల్లా కార్యదర్శి అయ్యప్ప స్వామి, నర్వ మాజీ సర్పంచ్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, మండల బీజేపీ నాయకుడు వావిళ్ల వెంకటేశ్వర రెడ్డి, నర్వ బూత్ అధ్యక్షులు కిస్టారెడ్డి, అయ్యన్న, హనుమంత్ రెడ్డి, రామ్ రెడ్డి, బుచ్చి రెడ్డి, రామచంద్రీ, బోయ పెద్ద అంజి, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోనే గ్రామీణ వైద్యులకు సంపూర్ణ భద్రత

- గ్రామీణ వైద్యులకు పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయాలి

- ప్రాథమిక వైద్యం చేసుకునే విధంగా చట్టబద్ధత కల్పించాలి

- ఆర్ఎంపీలపై అధికారుల దాడులను ఆపాలి

- ప్రభుత్వం అనుమతి ఇవ్వకుంటే ఉద్యమం చేస్తాం

- గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పిట్టల

ముదిగొండ అక్టోబర్ 25 వాయిస్ టుడే బీ మారుమూల ప్రాంతాలలో పనిచేస్తున్న గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించేందుకే గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘాన్ని స్థాపించడం జరిగిందని సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోనే ఆర్ఎంపీలకు సంపూర్ణ భద్రత ఉంటుందని ప్రతి ఒక్క ఆర్ఎంపీ స్వేచ్ఛగా గ్రామాల్లో ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ముదిగొండ మండల పరిధిలోని వనంవారి కిష్టాపురంలో ముదిగొండ మండల ఏడవ మహాసభ జిల్లా అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యులకు పారామెడికల్ బోర్డు ద్వారా శిక్షణ కొరకు బడ్జెట్ విడుదల చేసి కొంతమందికి జిల్లాల వారీగా శిక్షణ ఇచ్చారని ఇంతలోనే రాజశేఖర్ రెడ్డి అకాల మరణం జరిగి శిక్షణ మధ్యలోనే ఆగిపోయింది అన్నారు. నాటినుండి నేటి వరకు ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ గ్రామీణ వైద్యుల శిక్షణ పూర్తిచేసి సర్టిఫికెట్లు అందజేయకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఆర్ఎంపీలకు పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను అందజేసి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి ప్రభుత్వ పథకాలలో గ్రామీణ వైద్యులను భాగస్వాములను చేస్తే మారుమూల పల్లె ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందుతుందన్నారు.

ఆర్ఎంపీలు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలి

గ్రామాలలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులు కేవలం ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని నిబంధనలు అతిక్రమించి ఎలాంటి సీరియస్ కేసులు చేయవద్దని జిల్లా అధ్యక్షులు పిట్టల సూచించారు. ఏదైనా అత్యవసర సమయంలో ప్రాథమిక వైద్యం అందించి తక్షణం సంబంధిత క్వాలిఫైడ్ డాక్టర్ల వద్దకు పంపించాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల మన్నన లలు పొందాలన్నారు. సమావేశానంతరం పలువురు మండల అధ్యక్షులకు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నెమలికొండ మణికుమార్,నారపోగు సుదర్శన్, జిల్లా సహాయ కార్యదర్శి పెద్ద భాస్కర్, వట్టికూటి ఉపేందర్, ముదిగొండ మండల అధ్యక్ష కార్యదర్శులు నేరెళ్ల నరసింహారావు,కాంచాని శ్రీనివాస యాదవ్, నాయకులు పి అప్పారావు, వెంకట నరసయ్య,వర్ధన్ రాజు,పి మోహనరావు, నాగేశ్వరరావు,పి రాజశేఖర్, వెంకటేశ్వరరావు,షేక్ సొందు సాహెబ్,ఎండి ఖలీల్,నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన బగల మహా క్రతువు

108 కుండాత్మక యజ్ఞంలో పాల్గొన్న 216 జంటలు

హాజరైన వేద పండితులు, ప్రముఖులు, భక్తులు

శివ్వంపేట, అక్టోబర్ 25 వాయిస్ టుడే : దశమహావిద్యలో ప్రముఖమైన విద్యగా పేరుగాంచి మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన శ్రీబగలాముఖీ శక్తిపీఠంలో ఆదివారం లోక కల్యాణం, సకల జనుల శాంతికై అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అష్టోత్తరశత (108) కుండాత్మక మహాయగం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మహాయాగ క్రతువులో భాగంగా ఉదయం 8 గంటల నుంచే తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన సుమారు 50 మంది వేద పండితుల మంత్రోచ్ఛారణ, వేదఘోషలతో శక్తిపీఠం ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకుంది. శక్తిపీఠం ప్రాంగణంలో 108 అగ్నికుండలాలలో 216 జంటలు యజ్ఞంలో పాల్గొని, బగలాముఖీ అమ్మవారికి విశేషంగా పసుపుతో హరిద్రార్చన నిర్వహించడంతోపాటు రుద్రయామల, శ్రీసూక్తం, దేవీసూక్తం, బగలాముఖీ అష్టోత్తర నామార్చనలతో ప్రత్యేక పూజలు, అభిషేకం, మంత్రపుష్పం చేపట్టి, చివరగా పూర్ణాహుతితో కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ముగించారు. వేద మంత్రాల నడుమ సాగిన మహాయాగం తో బగల శక్తిపీఠం, ప్రాంగణం ఆధ్యాత్మిక కళతో భక్తులను ఆకట్టుకున్నది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్త జనాలతో నిండిపోయింది. మహాయజ్ఞం కార్యక్రమ ఏర్పాట్లను మాజీ జడ్పీటీసీ, శక్తిపీఠం ట్రస్టు సభ్యులు పబ్బా మహేశ్ గుప్తా, స్థల ధాత పబ్బా రమేష్ గుప్తాలు పర్యవేక్షించి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. మహా క్రతువు ముగిసిన తర్వాత 3 వేల మంది భక్తులకు శివ్వంపేట కు చెందిన పబ్బా రమేష్ గుప్తా, పబ్బా మహేశ్ గుప్తా, సుదర్శన్ గౌడ్ లు అలాగే హైదరాబాద్ కు చెందిన వెంకట్ రెడ్డి లు వారి సొంత ఖర్చులతో అన్నదానం చేశారు. అదేవిధంగా భక్తులందరికీ రామకృష్ణ అనే భక్తుడు మంచినీటి సదుపాయం కల్పించారు. శ్రీ బగలాముఖీ శక్తిపీఠంలో అష్టోత్తర శత కుండాలలో (108) బగలాముఖీ మూలమంత్ర యాగాన్ని ప్రముఖ వేద పండితులు గంగవరం రామశర్మ, గంగవరం ఆంజనేయ శర్మ, సంపత్ కుమార్ శర్మ, యల్లాప్రగడ చంద్రశేఖర శర్మ, భరద్వాజ శర్మ, శివశర్మ, విద్యాసాగర్ శర్మ,చారు దత్త శర్మ, రాజేశ్వర శర్మ, దోసపాటి నవీన్ శర్మ , మంగళంపల్లి శ్రీనివాస శర్మ, కాసుల చంద్రశేఖర శర్మ, ధారూర్ పురుషోత్తమ శర్మ, మల్లోజ్జుల శంకర శర్మ, శాస్త్రుల వివేక శర్మ, అయ్యప్ప శర్మ, కార్తీక శర్మ, వామన శర్మ, పురుషోత్తమ శర్మ లతో పాటు ఆలయ అర్చకులు కమలేష్ ద్వివేది వేద ధ్వనులతో శక్తిపీఠ వ్యవస్థాపకులు శ్రీ శాస్త్రుల లక్ష్మీ వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో వారి యొక్క సంకల్పబలంతో ఈ మహా యజ్ఞన్ని అత్యంత వైభవంగా జరిపారు. పీఠానికి తరలివచ్చిన భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే, ప్రముఖులు

లోక కళ్యాణార్థం అమ్మవారి ఉపాసకులు బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అష్టోత్తరశత (108) కుండాత్మక మహాయజ్ఞం వైభవంగా ఆదివారం మండల కేంద్రమైన శివంపేట భగలాముఖి శక్తిపీఠంలో ఘనంగా నిర్వహించారు. ఈ మహా యాగానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్త, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం శివకుమార్ గౌడ్, పబ్బా రమేష్ గుప్తా, నర్సాపూర్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ అశోక్ గౌడ్, సీఐ వెంకటరాజాగౌడ్ దంపతులు, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్, ఉపసర్పంచ్ మల్లేష్ తదితరులు భగలాముఖి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చలో జడ్చర్ల శంఖారావానికి కదిలిన మక్తల్ బ్రాహ్మణ సంఘం

మక్తల్ అక్టోబర్ 25 వాయిస్ టుడే ప్రతినిధి: జడ్చర్లలో జరిగే ఉమ్మడి పాలమూరు జిల్లా బ్రాహ్మణ శంఖారావానికి కదిలిన మక్తల్ బ్రాహ్మణ సమూహం. బ్రాహ్మణుల ఆత్మగౌరవం, హక్కుల సాధన మరియు సమైక్యతను చాటిచెప్పే లక్ష్యంతో జడ్చర్లలో నిర్వహిస్తున్న "ఉమ్మడి జిల్లా బ్రాహ్మణ శంఖారావం" మహాసభకు మక్తల్ నియోజకవర్గం నుంచి బ్రాహ్మణ ప్రతినిధులు, బంధుమిత్రులు మరియు మహిళలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా బయలుదేరారు. మక్తల్ 13వ వార్డు కౌన్సిలర్ సరిత,గుర్జాల్ సురేంద్రా చారి, గారు మరియు ఎస్. రమేష్ రావు గార్ల ఆధ్వర్యంలో, వారి మార్గదర్శకత్వంలో ఈ చారిత్రక సభకు సుమారు 100 మంది బ్రాహ్మణులు 10 వాహనాల్లో తరలివెళ్లారు.

పాల్గొన్న ప్రముఖులు..

గుడి శ్యామ్ సుందర్ జోషి గారు, విద్వాన్ రాఘవేంద్ర చారి, ప్రాణేశాచారి, గోవిందరావు రఘు ప్రసన్న భట్, మఠం వాదిరాజ్, హనుమేష్ రావు, పారేవుల తిరుమల మరియు పశ్చిమముఖ భజన మండలి మహిళా సభ్యులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభ విజయవంతం కావాలని బయలుదేరారు. సమాజంలో బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం, సంక్షేమం, విద్యా–ఉపాధి రంగాలలో తగిన గుర్తింపు సాధించడమే ధ్యేయంగా మక్తల్ నియోజకవర్గ గళాన్ని బలంగా వినిపించడానికి అందరూ సంసిద్ధులయ్యారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుల్తానాబాద్ ప్యాక్స్‌కు ప్రత్యేక గుర్తింపు

- 79 మార్కులతో సత్తా చాటిన సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

- రైతులకు మెరుగైన సేవలు

- పారదర్శక నిర్వహణకు గుర్తింపు

సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా అక్టోబర్–25 వాయిస్ టుడే: ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్యాక్స్ పనితీరుపై నిర్వహించిన మూల్యాంకనంలో సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పి ఎ సి ఎస్ డెబ్బై తొమ్మిది మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల పరిధిలోని సహకార సంఘాల పనితీరును వివిధ అంశాల ఆధారంగా పరిశీలించగా, సుల్తానాబాద్ ప్యాక్స్ అత్యుత్తమ మార్కులు సాధించి తన పనితీరును చాటుకుందని సంఘ పాలకవర్గం వెల్లడించింది. ఈ గుర్తింపు పట్ల సంఘం పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు మెరుగైన సేవలతో గుర్తింపు

వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలుస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సుల్తానాబాద్ ప్యాక్స్ రైతులకు సకాలంలో పంట రుణాలు అందించడం, ఎరువులు, విత్తనాల సరఫరాను సమర్థవంతంగా నిర్వహించడం, ధాన్యం సేకరణ ప్రక్రియలో పారదర్శకత పాటించడం వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. అదేవిధంగా రుణాల వసూళ్లలో పురోగతి సాధించడం, సంఘ ఆదాయాన్ని పెంపొందించేలా వ్యాపార కార్యకలాపాలను విస్తరించడం, డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించడం, మెరుగైన పరిపాలనా విధానాలను అమలు చేయడం వంటి అంశాలు మూల్యాంకనంలో కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ అన్ని అంశాల్లో సాధించిన పురోగతి కారణంగానే సుల్తానాబాద్ ప్యాక్స్‌కు డెబ్బై తొమ్మిది మార్కులు లభించాయని తెలిపారు.

రైతుల నమ్మకమే విజయానికి పునాది

ఈ సందర్భంగా ప్యాక్స్ పీఏసీ చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని ప్యాక్స్‌ల పనితీరు మూల్యాంకనంలో సుల్తానాబాద్ సంఘం డెబ్బై తొమ్మిది మార్కులు సాధించడం గర్వకారణమన్నారు. ఈ గుర్తింపు వెనుక రైతుల నమ్మకం, పాలకవర్గ సభ్యుల సహకారం, సంఘ కార్యదర్శి బూరుగు సంతోష్‌తో పాటు సిబ్బంది నిరంతర కృషి ఉన్నాయని పేర్కొన్నారు.రైతులకు అవసరమైన సేవలను సకాలంలో అందించడంతో పాటు, సంఘ కార్యకలాపాలను పారదర్శకంగా నిర్వహించేందుకు పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. రైతులకు రుణ సదుపాయాలు కల్పించడం, వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచడం, ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడడం తమ ప్రధాన లక్ష్యాలని వివరించారు.

భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు

ప్రస్తుత గుర్తింపుతో మరింత బాధ్యత పెరిగిందని శ్రీగిరి శ్రీనివాస్ పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ రైతులకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. సహకార రంగం ద్వారా రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా సంఘ కార్యకలాపాలను విస్తరించడంతో పాటు, నిర్వహణ ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు.సుల్తానాబాద్ ప్యాక్స్ సాధించిన ఈ గుర్తింపు సంఘ అభివృద్ధికి సహకరించిన రైతులు, పాలకవర్గ సభ్యులు, అధికారులు, సంఘ సిబ్బంది సమష్టి కృషికి నిదర్శనమని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

టీజే డబ్ల్యూ ఏ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టులకు సన్మానం

కోదాడ, అక్టోబర్ 25(వాయిస్ టుడే ప్రతినిధి): తెలుగు జర్నలిస్టుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వేమూరి సుధాకర్ ఫంక్షన్ హాల్ లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించ బడింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఏర్నేని కుసుమ మాట్లాడుతూ, జర్నలిస్టులు, ప్రజా ప్రతినిధులు పరస్పర సహకారంతో సమాజ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ప్రోగ్రెసివ్ జర్నలిస్ట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ,సీనియర్ జర్నలిస్ట్ లు,ఏనుగుల వీరాంజనేయులు, కస్తూరి రాములు ,మదూరీ వెంకటేశ్వరరావు, శ్రీహరి, మరి కొంతమంది సీనియర్ పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. సందేశం టైమ్స్ జర్నలిస్టులు, జర్నలిస్ట్ యూనియన్ జాతీయ నాయకులు పాల్గొన్నారు.

రైస్ మిల్లు కార్మికుల చలో హైదరాబాద్

సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా అక్టోబర్–25 వాయిస్ టుడే: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మహా ధర్నాలో పాల్గొనేందుకు సుల్తానాబాద్ రైస్ మిల్లు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కార్మికులు ప్రయాణించే వాహనాలను సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా తాండ్ర అంజయ్య మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగిస్తూ యజమానులకు ప్రయోజనం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నెలకు కనీస వేతనం నలభై రెండు వేలు చెల్లించాలని, పని భద్రతతో పాటు సామాజిక భద్రత కల్పించాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైస్ మిల్లు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక విధానాలను మార్చుకోవాలని అన్నారు.అలాగే ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం నిర్వహించిన మహా ధర్నాకు సుల్తానాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు తరలిరావడంపై ఆయన అభినందనలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, సీఐటీయూ మండల కన్వీనర్ తాండ్ర అంజయ్య, రైస్ మిల్లు ఆపరేటర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నౌండ్ల బ్రహ్మచారి, వీరగోని కిరణ్ గౌడ్, దండి సంపత్, దుర్గం మహేందర్, విలాస్, ఆసరి మహేష్, ప్రసాద్, సదయ్య, ప్రభాకర్, లచ్చయ్య, లక్ష్మయ్య,రైస్ మిల్లు లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు పోగుల తిరుపతి, మంజూర్, అబ్బా, రియాజ్, రబ్బాని, శ్రీనివాస్, మాతంగి శంకర్‌తో పాటు హమాలీ సంఘం నాయకులు లచ్చన్న, నరేష్, శీను, రాజయ్య పాల్గొన్నారు.

అమరవీరుని జ్ఞాపకాలు మరువలేనిలేనివి

అమరుడి జ్ఞానపకాలు తెచ్చిన కన్నీళ్లు
గురుజావాడలో సురేష్‌కు సిఐ రవి, ఎస్ఐ నరేష్ నివాళులు

జహీరాబాద్ వాయిస్ టుడే అక్టోబర్ 25 సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహిర్ మండలంలోని గురుజువాడ గంజాయి స్మగ్లర్ల చేతిలో దారుణంగా హత్యకు గురైన గురుజావాడ గ్రామానికి చెందిన సురేష్‌కు జహీరాబాద్ సిఐ రవి, కోహిర్ ఎస్సై నరేష్ నివాళులర్పించారు. గురుజావాడలోని సురేష్ నివాసానికి వెళ్లి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అమరవీరుడికి ఘన నివాళి అర్పించారు. 2010వ సంవత్సరంలో నాగూర్ గ్రామ శివారులో గంజాయి స్మగ్లర్ల దాడిలో సురేష్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అప్పట్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించింది. సురేష్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఆసరాగా ఉన్న కుమారుడిని కోల్పోయి, ఆ జ్ఞాపకాలతోనే జీవిస్తున్నామని కుటుంబ సభ్యులు వ్యక్తం చేశారు. సురేష్ కుటుంబానికి అండగా నిలవాలని, వారి న్యాయపోరాటానికి ప్రభుత్వం స్పందించాలని వారు డిమాండ్ చేశారు. సందర్భంగా కుటుంబ సభ్యులు గ్రామ సర్పంచ్ ప్రియాంక రాజేందర్. జహిరాబాద్ పట్టణ సీఐ రవి, కోహిర్ ఎస్సై నరేష్. వారి సిబ్బంది ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

36 ఏళ్ల తర్వాత కలుసుకున్న
గుంపుల తిరుమలగిరి జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

సూర్యాపేట జిల్లా వాయిస్ టుడే ప్రతినిది అక్టోబర్ 25 : చివ్వెంల మండలం గుంపుల తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989– 90 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని జీవీవీ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాటి విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాలలోని తమ యొక్క నాటి స్మృతులు మరిచిపోలేని మధురానుభూతులని అన్నారు.36 ఏళ్ల తర్వాత నాటి విద్యార్థులంతా ఒకచోట కలుసుకొని జ్ఞాపకాలను పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు.తాము చదువుకున్న రోజులను, స్నేహితులతో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకున్నారు.తమకు విద్యాబుద్ధులు నేర్పి నేడు ఉన్నత స్థాయిలో ఉండేలా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు తమ నుండి దూరమైన ఉపాధ్యాయులకు,తోటి విద్యార్థులకు ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం నాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులందరూ వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగి గుర్తింపు తెచ్చుకోవడం ఆనందంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ, వెంకటేశ్వర రావు, సావిత్రి, విద్యార్థులు బి.వెంకటేశ్వర్లు, ఎం.వెంకన్న, డి.నాగేష్, ఎం.రాము, వై.వెంకటరెడ్డి, కోటేశ్వరరావు, లింగయ్య, శ్రీనివాస్, బాలాజీ, పిచ్చయ్య, శేఖర్, కవిత, పిచ్చమ్మ, రాజకుమారి, సత్యవతి, లక్ష్మీ, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

RNI No: TGTEL/25/A2649
VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
సోమవారం 26 అక్టోబరు 2026

కొల్లూరులో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యం:

ఝరాసంగం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుఉదయ్ శంకర్ పాటిల్

జహిరాబాద్ వాయిస్ టుడే అక్టోబర్ 25: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నూతనంగా నిర్మించిన ఇళ్లను ఆదివారం కొల్లూరు గ్రామంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఝరాసంగం మండల అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయ్ శంకర్ పాటిల్ మాట్లాడుతూ, పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు సొంతింటి కల నెరవేరుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చింతల్ గట్టు శివరాజ్ .వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను తీర్చండి

ఖమ్మం , అక్టోబర్ 25 (వాయిస్ టుడే): తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యాలయంలో ఈరోజు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జిల్లా కార్యవర్గం సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభంలో, అకాల మరణం చెందిన, తోటి సహచరులకు, సంసాప సూచకంగా, రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు కే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాల్లో కొన్ని చోట్ల వాహనాల కొరత ఉందని, ఆయా స్థానాలలో వాహనాల సౌకర్యం కల్పించాలని, కొత్త వాహనాలు కొనుగోలు చేయాలని , ఉద్యోగులకు రావలసిన ఈ ఆర్ సి , డి ఏ బకాయిలను క్లియర్ చేయాలని , తమ విన్నపాన్ని టి జి జేఏసి ద్వారా అధికారులకు తెలియజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌస్ సొసైటీ చైర్మన్ ఎండి సలీం, బిల్డింగ్ సొసైటీ ముఖ్య సలహాదారులు కె కోటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడు బి రామారావు జిల్లా కోశాధికారి ఎస్వీ ప్రసాద్ డివిజన్ అధ్యక్షులు లింగంపల్లిగంగ గౌరవ సలహాదారులు నరసింహారావు , కొత్తగూడెం జిల్లా కన్వీనర్ వనమా శ్రీనివాసరావు భద్రాచలం డివిజన్ అధ్యక్షులు కే రాఘవులు, కో కన్వీనర్ నాగరాజు, కొత్తగూడెం జిల్లా ముఖ్య సలహాదారులు ఆదినారాయణ మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వేములవాడలో 80 అడుగుల రోడ్డు పనులు పరిశీలించిన: విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, అక్టోబర్ 25 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో జరుగుతున్న 80 అడుగుల రహదారి నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరిశీలించారు. మున్సిపల్ పాలకవర్గం, అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భం గా రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాజన్న ఆలయ అభివృద్ధి, వేములవాడ పట్టణ అభివృద్ధి తమ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ, వేములవాడను ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్‌ది పనికిమాలిన రాజకీయం

నవంబర్ 5న కరీంనగర్‌లో భారీ ర్యాలీ విజయవంతం చేయండి

బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు

కరీంనగర్ రూరల్,అక్టోబర్ 25(వాయిస్ టుడే):కేంద్ర ఎన్నికల సంఘం ఎంతో పారదర్శకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తూ పనికిమాలిన రాజకీయం చేస్తోందని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొత్తపల్లి మండలంలో నిర్వహించిన పోలింగ్ బూత్ సమావేశం ,ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' వీక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.నకిలీ ఓట్లను, మరణించిన వారి ఓట్లను తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే ఎస్ఐఆర్ ప్రక్రియ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.గతంలో 1952,1957,1961,1965-66,1983-84, 1987-89,1992-95,2002-2004 సంవత్సరాల్లో కూడా ఈ సవరణలు జరిగాయని,సుదీర్ఘకాలం తర్వాత మళ్లీ 2025-2026 లలో ఈ ప్రక్రియ శరవేగంగా సాగుతోందని గుర్తుచేశారు.ఓటు బ్యాంక్ రాజకీయం కోసం కాంగ్రెస్,చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్,ఎన్నికల వ్యవస్థపై అసత్య ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు.దేశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు 50 ఏళ్లు పాలించిందని,ఇన్ని దశాబ్దాలు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ ఓట్ చోరీ చేసే అధికారంలో కొనసాగిందా అని ప్రశ్నించారు.దేశవ్యాప్తంగా ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ పనికిమాలిన రాజకీయాలు చేసి,మోడీ ప్రభుత్వంపై బురద జల్లడానికి.దేశ వ్యతిరేక శక్తులతో కలిసి ఇలాంటి రాజకీయాలు చేస్తుందని ఘాటుగా విమర్శించారు.దేశవ్యాప్తంగా నేడు కాంగ్రెస్ ప్రజా విశ్వాసం కోల్పోయిందని,ప్రధానంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో దేశానికి వలస వచ్చి అక్రమంగా ఓటు పొందిన రోహింగ్యాలు,మైనార్టీల ఓటు తొలగిస్తున్నారనే నేపంతోనే కాంగ్రెస్ గగ్గోలు పెడుతుందన్నారు. నకిలీ ఓట్ల తొలగింపును కాంగ్రెస్ ఎందుకు అడ్డుకుంటోంది? రాహుల్ గాంధీ "ఓట్ చోరీ"ఆరోపణలు అర్థరహితనన్నారు.ప్రజలను తప్పుదారి పట్టిస్తూ రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి బుద్ధి వచ్చేలా నవంబర్ 3న కరీంనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నవంబర్ 5న కరీంనగర్‌లో నిర్వహించనున్న భారీ ర్యాలీకి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి,మాజీ కేంద్రమంత్రి స్మృతి ఇరానీ హాజరవుతున్నట్లు ప్రవీణ్ రావు వెల్లడించారు.ఈ ర్యాలీలో యువత,ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.ర్యాలీని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు తగిన కృషి చేయాలని తెలిపారు.సమావేశ అనంతరం ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ప్రవీణ్ రావు వీక్షించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కుంట తిరుపతి,శక్తి కేంద్ర ఇన్చార్జ్ వేముల అనిల్ కుమార్,బూత్ అధ్యక్షులు ఎగ్గొజు సంపత్ చారి,బోనాల పరశురాము,గ్రామ సర్పంచ్ నునుగొండ మానస ప్రవీణ్,వార్డు మెంబర్లు రుద్ర రాజ్ కుమార్,పెంట సురేష్,సీనియర్ నాయకులు మెరుగు మల్లేశం,వరాల మల్లేశం,పెంటి సంతోష్ కుమార్,గీకురు చందు,రవికుమార్ పాల్గొన్నారు

సమాజ వికాసమే సాహిత్యం

ఖమ్మం , అక్టోబర్ 25 (వాయిస్ టుడే): డా పట్టాభి కళాపీఠం ఆధ్వర్యం లో డా తూములూరి రాజేంద్ర ప్రసాద్ సంపాదకత్వం లో గుంటూరు యస్ హే ఓ కార్యాలయం లో " భారత దేశంలో రాజకీయ పార్టీల పిరాయి 0పులు " కవితా సంకలనం ను కార్యక్రమానికి విశిష్ట అతిథి గా హాజరైన తెలంగాణ రాష్ట్ర వికాస వేదిక సాహిత్య సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ప్రజాకవి లెనిన్ శ్రీనివాస్ ఆవిష్కరించారు . సభకు డా తూములూరి రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పిల్లల వైద్యురాలు టి సుస్మిత హాజరు కావడం సభను ఉద్దేశించి సమాజం సంక్షోభ స్థితిలో ఉంది రాజకీయాలు ప్రజా సంక్షేమము వదిలేసి ఒకరి మీద ఒకరు మాటల యుద్ధాలను చేస్తూ వ్యవస్తను నిర్వీర్యం చేస్తూ నియంతలా పాలించడం ప్రశ్నించే హక్కును కాలరాయడం ఊసర వెల్లుల కన్నా దిగజారి నైతిక విలువలకు పాతరేసి పార్టీలు మారడం శోచనీయం కాగా డబ్బుతో రాజకీయాలను శాశిస్తూ పెద్దాయన ఆయన కొడుకు మనుమడు ఇలా వారే ఉన్నంత కాలం రాజ్యమేలే పన్నాగాలు చేస్తూ ప్రజాస్వామ్యం నిర్వీర్యం చేస్తూ అందిన కాడికి దోస్తు దోచిన దాన్ని రక్షణ కవచంగా రాజకీయము చేస్తున్నారని అందుకే సమాజం నుండి కులము మతము తరిమి వేయబడిన నాడు ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది లెనిన్ శ్రీనివాస్ తెలియజేశారు. పిల్లలకు సాధ్యమైనంత దూరంలో సెల్లు ఫోన్లు ఉంచాలని వారి ఎదుగుదల పై తీవ్ర ప్రభావం ఉంది మానసిక రోగులుగా తయారవుతారని వారికి ప్రసిద్ధ సంఘటనలు చందమామ కథలు స్ఫూర్తి దాయక చరిత్రలు చెప్పాలని డా టి సుస్మిత వివరించారు . డా తూములూరి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ డా పట్టాభి కళాపీఠం ఆధ్వర్యం లో అనేక ఆలోషింప దగ్గ కార్యక్రమాలతో ప్రభుత్వం గుర్తించలేని వారి గుర్తించి వారిని సమున్నతంగా గౌరవిస్తూ సమాజ హితాన్ని కోరే అనేక పుస్తకాలను ముద్రించి సాహితీ లోకం ముందుకు తీసుకు వచ్చిందని వివరించారు.

ఆదిశేషుని నీడలో శ్రీనివాసుడి దివ్య వైభవం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో రంగనాయక తిరుప్పోలం వాహన సేవ

సిరిసిల్ల, అక్టోబర్ 25 (వాయిస్ టుడే): సిరిసిల్ల పట్టణం లో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి, గోదాదేవి సమేతుడైన శ్రీనివాసుడు ఆదిశేషుని పడగల నీడలో శ్రీ రంగనాయక తిరుప్పోలం వాహనంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి దివ్య అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ మహాలక్ష్మి ఐశ్వర్యం, కరుణకు ప్రతీకగా భూదేవి సహనం, క్షమా గుణం, సమస్త జీవరాశుల పోషణకు ప్రతిరూపంగా నిలుస్తారని, గోదాదేవి అచంచల భక్తి, సంపూర్ణ శరణాగతికి ప్రతీకగా విరాజిల్లుతారని అర్చకులు వివరించారు. ఆదిశేషుని పడగల నీడలో అమ్మవార్ల సమేతంగా స్వామివారు దర్శనమివ్వడం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచింది. ఈ వాహన సేవ భక్తి, విశ్వాసం, వినయం, దైవ సేవ ప్రాముఖ్యతను చాటిచెప్పిందని భక్తులు పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమం లో ఆలయ ప్రధాన అర్చకులు మాడంరాజు కృష్ణ మాచార్యులు, ఆలయ ఈవో మారితిరావు, అర్చకులు రవీందర్, బీట్కూరి నవీన్, జయవర్ధన్, సుకుమార్, రంగాచారి, డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, వికాస తరంగిణి సభ్యులు నాయిని మంగ, పెద్ది శ్రీనివాస్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన లయన్స్ క్వెస్ట్ ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమం

కరీంనగర్,అక్టోబర్ 25(వాయిస్ టుడే): లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా పరిధిలో కరీంనగర్‌లోని మంకమ్మతోట,పరమిత హైస్కూల్‌లో నిర్వహించిన రెండు రోజుల లయన్స్ క్వెస్ట్ ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. విద్యార్థుల సామాజిక,భావోద్వేగ వికాసాన్ని పెంపొందించడంతో పాటు,వారిలో ఆత్మవిశ్వాసం,స్వీయ నియంత్రణ, సత్సంబంధాలు,బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, సానుకూల ప్రవర్తన వంటి లక్షణాలను అభివృద్ధి చేయడానికి అవసరమైన బోధనా పద్ధతులపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడం ఈ శిక్షణా కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం.ఈ కార్యక్రమానికి జిల్లా గవర్నర్ మోర భద్రేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పరమిత విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఈ.ప్రసాద్ రావు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు.పోతాని ప్రవీణ్ కుమార్ శిక్షణా కార్యక్రమ సమన్వయ బాధ్యతలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు విద్యాబోధనతో పాటు అవసరమైన జీవిత నైపుణ్యాలను నేర్పించడం,తరగతి గదిలో ఆహ్లాదకరమైన, సహాయకరమైన వాతావరణాన్ని సృష్టించడం వంటి అంశాలపై శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో చిదుర సురేష్,సెంటెనియల్ చార్టర్ డిస్ట్రిక్ట్ గవర్నర్,జాతీయ శిక్షకురాలు కొండపల్లి రేణుక,లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షుడు మైడం శివకాంత్,బట్టు వినోద్,మెతుకు కె.చైతన్య,సింగమరాజు, కోల అన్న రెడ్డి,పాఠశాల ప్రిన్సిపాల్ బాలాజీ పాల్గొన్నారు.

ఓట్ బచావో దేశ్ బచావో చౌపాల్"పై జిల్లా కాంగ్రెస్ అత్యవసర భేటీ

కరీంనగర్,అక్టోబర్ 25(వాయిస్ టుడే): ఏఐసీసీ/టీపీసీసీ పిలుపు మేరకు ఓట్ బచావో దేశ్ బచావో చౌపాల్" కార్యక్రమంపై అవగాహన,భవిష్యత్ కార్యాచరణపై డిసిసి కార్యాలయంలో జిల్లా పరిధిలోని ఎంపీలు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, పోటీ చేసిన అభ్యర్థులు,ఫ్రంటల్ ఆర్గనైజేషన్స్, విభాగాలు, చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్లు,ఏఐసీసీ/టీపీసీసీ/డీసీసీ నాయకులు, మండల/ పట్టణ డివిజన్ అధ్యక్షులతో అత్యవసర సమావేశం నిర్వహించారు.కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు,వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి చొప్పదండి ఎమ్మెల్యే,కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా.మేడిపల్లి సత్యం సభాధ్యక్షతన వహించగా, కరీంనగర్ ఉమ్మడి జిల్లా క్లస్టర్ ఇంచార్జ్ లు ఏఐసీసీ పరిశీలకులు ఎస్.శరత్,పిసిసి పరిశీలకులు కూన శ్రీశైలం గౌడ్,మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణలు ముఖ్య అతిథులుగా మరియు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి,సత్తు మల్లేశం,ఒడితల ప్రణవ్,ఊట్కూరు నరేందర్ రెడ్డి,కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆరేపల్లి మోహన్,పురుమళ్ళ శ్రీనివాస్ హాజరై పార్టీ శ్రేణులకు కార్యక్రమాన్ని ఉద్దేశించి దిశా నిర్దేశం చేశారు.ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి దేశ పౌరులతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మద్దతు ఇవ్వాలని,ఓటు చోరీకి బాధ్యత వహిస్తూ రాజీనామాకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ సిద్ధమైనప్పటికీ ప్రధాని మోడీ హోం మంత్రి అమిత్ షా అడ్డుపడుతున్నారని,నవంబర్ 1న ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు జిల్లాలోని ప్రతి నియోజకవర్గ నుండి కనీసం వందమంది కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మునిసిపల్ చైర్మన్ రొంటాల సుహాసిని,ఏఎంసి చైర్మన్ ఆకుల నరసయ్య,సిరాజు హుస్సేన్,ఎండి తాజ్,కర్ర సత్య ప్రసన్న రెడ్డి, కొరివి అరుణ్ కుమార్, శ్రావణ్ నాయక్,ముత్యం శంకర్,కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, అహమ్మద్ అలీ,అబ్దుల్ రహమాన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, డివిజన్ ప్రెసిడెంట్లు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మెగా అభిమానులంతా ఏకతాటిపైకి రావాలి

జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాస్ విజయానికి కృషి చేయాలి

తెలంగాణ రాష్ట్ర మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ కాస రాజు పిలుపు

వరంగల్/కరీంనగర్,అక్టోబర్ 25 (వాయిస్ టుడే): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి,జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ఖమ్మం వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాస్ నాయకత్వానికి మద్దతుగా మెగా అభిమానులంతా సమన్వయంతో ముందుకు రావాలని తెలంగాణ రాష్ట్ర మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ కాస రాజు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వరంగల్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో కాస రాజు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం, వరంగల్,నల్గొండ జిల్లాలకు చెందిన మెగా అభిమానులందరూ ఏకతాటిపైకి వచ్చి,జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నాయకత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు.ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాస్ కు మద్దతుగా మెగా అభిమానులు,జనసేన పార్టీ శ్రేణులు,మిత్రులు,శ్రేయోభిలాషులు సమన్వయంతో పనిచేస్తూ తమ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా,డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పట్టభద్రుల ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని సూచించారు. నవంబర్ 6వ తేదీ చివరి గడువు కావడంతో అర్హులైన ప్రతి ఒక్కరూ వెంటనే ఓటరు నమోదుకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఓటరు నమోదు ప్రక్రియలో ఏవైనా సందేహాలు ఉన్నా,సహాయం అవసరమైనా తనను సంప్రదించవచ్చని కాస రాజు తెలిపారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయండి

మానకొండూర్ ఏఎంసీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండుర్,అక్టోబర్ 25 (వాయిస్ టుడే): రైతుల సంక్షేమం కోసం వ్యవసాయ మార్కెట్ కమిటీ కొత్త పాలకవర్గం చిత్తశుద్ధితో పనిచేయాలని మానకొండూరు ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. మానకొండూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.చైర్మన్ గా రేవెల్లి రాజలింగం,వైస్ చైర్మన్ గా రేమిడి శ్రీనివాస్ రెడ్డితోపాటు నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన పాలకవర్గం రైతుల సంక్షేమం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా మార్కెట్ కమిటీని సమర్థ వంతంగా నిర్వహించి,రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కాంగ్రెస్ హయాంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా రైతు పక్షపాతిగా పనిచేశారని,ఆయన బాటలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పయనిస్తున్నారని చెప్పారు.రేవంత్ రెడ్డి కూడా ముఖ్యమంత్రి అయ్యాక తొలి సంతకం ఉచిత విద్యుత్ పై చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని కవ్వంపల్లి చెప్పారు.పంటల సాగు, మందుల కొనుగోళ్లకే పెట్టుబడి సరిపోని పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రేవంత్ రెడ్డి రైతు రుణమాఫీ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు.ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.అంతేకాకుండా రైతులకు సబ్సిడీపై విత్తనాలు,వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నారని, ఐకెపి సెంటర్ల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతు న్నాయని, అలాగే 24 గంటల్లోనే కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బు రైతులకు జమ అవుతున్నా యని ఎమ్మెల్యే చెప్పారు.రైతులను మరింత ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నవడ్లకు బోనస్ కూడా ఇస్తున్నదని ఆయన తెలిపారు.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చేపట్టిన సంక్షేమ పథకాలతో రైతుల కళ్ళల్లో సంతోషం, ఆనందాన్ని చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కనుకనే రైతు సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పాటుపడు తున్నాయని డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు.కష్టపడితే గాని పదవి ఇవ్వలేని ఈ రోజుల్లో పదవుల పంపకం కత్తి మీద సాములా మారిందని ఎమ్మెల్యే సత్యనారాయణ పేర్కొన్నారు. గత సంవత్సర మానకొండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఒక బీసీ బిడ్డకు ఇవ్వగా, ఈసారి ఎస్టీ బిడ్డకు అవకాశం కల్పించినట్లు ఆయన వివరించారు.కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలకు పదవులు తప్పక వస్తాయని అని చెప్పారు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్,పాలకవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.ఏఎంసి చైర్మన్ గా రేవెల్లి రాజలింగం,వైస్ చైర్మన్ గా రేమిడి శ్రీనివాసరెడ్డి,డైరెక్టర్లుగా ఎర్రాల కవిత, తమ్మిశెట్టి రాజేశ్,రామినేని రమణ,కనకం అశోక్,రేపాక రాజేశ్వర్, కొత్తిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,మందల సంపత్ రెడ్డి,ముక్కెర సతీష్ కుమార్,ఆరవేణి రామాంజయ్య, దూలం వీరస్వామి,విశ్వనాథుల వీర కుమార్ ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అభివృద్ధి వేగవంతం అయిందన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ,రైతు భరోసా వంటి పథకాలతో పాటు ఎప్పటికప్పుడు రైతుల పక్షాన నిలుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఏఎంసీ నూతన పాలకవర్గం సంక్షేమ పథకాలను పేదలకు చేరువ చేయాలని ఆయన సూచించారు.టిపిసిసి సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూపదవుల పంపకంతో ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ సమతుల్యత పాటిస్తున్నారని కొని కొనియాడారు.ఇది ఆహ్వానించదగ్గ పరిణామమని,ఇదే వొరవడిని కొనసాగించాలని ఆయన కోరారు.కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య మాట్లాడుతూ అందరికీ అవకాశాలు కల్పించడం కోసమే ఏఎంసి,పాక్స్ పాలకవర్గాలను ఏర్పాటు జరుగుతున్నాయని చెప్పారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకార్యకర్తలను కడుపులో పెట్టుకొని ముందుకు సాగుతున్నారన్నారు.

ఎంసి నూతన చైర్మన్ రేవెల్లి రాజలింగం మాట్లాడుతూప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులకు చేస్తే ఎందుకు శాయశక్తుల ప్రయత్నిస్తానని చెప్పారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని, మార్కెట్ కమిటీ అభివృద్ధికి తోడ్పడతానాని ఆయన హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతుబిడ్డగా తనకు ఈ పదవి నాకు దక్కిందని,ఎందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పాలనలోదళారీ వ్యవస్థ లేదని,రైతులకు అన్ని రకాల పేర్లు జరుగుతున్నాయని చెప్పారు.ఎల్ నినో ప్రభావం రానున్న రోజుల్లో తీవ్రంగా ఉండబోతున్నదని,ఈ నేపథ్యంలో రైతులు మరింత అప్రమత్తంగా ఉంటూ కరెంటు,నీటిని పొదుపుగా వాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి,తహసిల్దార్ కె.విజయ్ కుమార్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ప్యాక్స్ చైర్మన్లు నాగిశెట్టి రాజయ్య (మాన కొండూర్),ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి (ఊటూరు),గంగుల రామ్ రెడ్డి,(గట్టు దుద్దెనపల్లి),రొంటాల లక్ష్మారెడ్డి (దేవంపల్లి), కీసర సంపత్ (తాడికల్), ఊట్కూరి వెంకటరమణారెడ్డి (ఇల్లంతకుంట),ఒగ్గు దామోదర్ (బెజ్జంకి), ఏఎంసి చైర్మన్లు మాతంగి శిరీష అనిల్, అంతగిరి సాహిత్య వినయ్ కుమార్, సర్పంచుల ఫోరం మండల చైర్మన్ పెంచాల కిషన్,పార్టీ రావు,వివిధ గ్రామాల సర్పంచులు,పార్టీ అధ్యక్షులు, నాయకులు,కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

అయోధ్య,కాశీ ఉచిత యాత్ర ప్రారంభం

కరీంనగర్,అక్టోబర్ 25(వాయిస్ టుడే): నగరంలోని వైశ్య భవన్ వద్ద గంప నారాయణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైశ్య నిరుపేద భక్తుల కోసం ఏర్పాటు చేసిన అయోధ్య,కాశీ ఉచిత యాత్ర కార్యక్రమం వైభవంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి మానకొండూర్ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ,నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మరియు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్,మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని జెండా ఊపి యాత్రను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంప శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ యాత్ర మూడో సంవత్సరానికి చేరుకుందని అభినందించారు. వైశ్య నిరుపేద భక్తుల కోసం గంప శ్రీనివాస్ తన సొంత ఖర్చులతో ఈ యాత్రను ఏర్పాటు చేశారని, సుమారు 8 రోజుల పాటు సాగే ఈ యాత్ర కోసం ప్రత్యేకంగా రెండు బస్సులను ఏర్పాటు చేసి,దాదాపు 45 కుటుంబాల సభ్యులను అయోధ్య, కాశీ క్షేత్రాలకు ఉచితంగా తీసుకెళ్తున్నారని తెలిపారు.యాత్రకు బయలుదేరిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి, ఈ యాత్రను విజయవంతంగా కొనసాగిస్తున్నారని అన్నారు. అయోధ్య రాముడు మరియు కాశీ విశ్వేశ్వరుని ఆశీస్సులతో భక్తుల యాత్ర సుఖంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్య క్రమంలో కార్పొరేటర్లు ఎన్నం ప్రకాష్,గాజ శివరాం,వైశ్య సంఘం ప్రతినిధులు, బిజెపి నాయకులు మరియు యాత్రకు బయలుదేరిన భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు

ఇల్లందకుంట అక్టోబర్ 25 (వాయిస్ టుడే): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని, పోలీసు సిబ్బంది ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఇల్లందకుంట ఎస్సై ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లందకుంటలోని శ్రీ సీతా రామ చంద్ర స్వామి ఆలయంలో, సిరిసేడు చర్చిలో, సిరిసేడు మసీదులో ప్రార్థనలు నిర్వహించి, పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరవీరుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమం, పోలీసు సిబ్బంది శ్రేయస్సు, ప్రజల భద్రత మరియు సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

గోదావరి జలాలను ఒడిసిపట్టి.. తాగునీటి అవసరాలు తీర్చడమే లక్ష్యం: తుమ్మల

భద్రాద్రి : ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో ఏర్పడే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలంలోని దుమ్ముగూడెం ఆనకట్టను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఆనకట్టపై ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేసేందుకు చేపడుతున్న పనులను మంత్రి పరిశీలించారు. పనుల పురోగతి, గోదావరి నీటి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మగారిపల్లి నుంచి దుమ్ముగూడెం వరకు పడవలో ప్రయాణిస్తూ ఆనకట్ట పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాస్త్రవేత్తలు వ్యక్తం చేస్తున్న అంచనాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలను భయాందోళనలకు గురిచేయడం తమ ఉద్దేశం కాదని, రానున్న పరిస్థితులను ముందుగానే అర్థం చేసుకుని నష్టాలను నివారించేందుకు ప్రజల్లో అవగాహన, ఆత్మస్థైర్యం పెంపొందించడమే లక్ష్యమని మంత్రి తెలిపారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి గోదావరి నీటిని నిల్వ చేయడం ద్వారా రానున్న వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. ఇంజినీరింగ్ అధికారుల సూచనల మేరకు ఆనకట్టపై సుమారు ఒక మీటర్ ఎత్తున ఇసుక బస్తాల పొరలను ఏర్పాటు చేసి దాదాపు ఒక టీఎంసీ నీటిని నిల్వ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

రానున్న కాలంలో నీటి కొరత తీవ్రం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. నీటి వనరుల పరిరక్షణ, తాగునీటి పొదుపు, రైతులకు అవగాహన కల్పించడం వంటి అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ, అమ్మగారి పల్లి సర్పంచి కవిత, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు చేపట్టాలి

- టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర

హనుమకొండ(వాయిస్ టుడే) అక్టోబర్ 25: తెలంగాణ ఉద్యమకారుల న్యాయమైన హక్కులు, డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఐక్య ఉద్యమాలు చేపట్టాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ ఉద్యమకారుడు టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర పిలుపునిచ్చారు. హనుమకొండలోని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక కార్యాలయంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుడిమల్ల రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన హనుమకొండ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఓదార్పు యాత్ర సన్నాహక సమావేశానికి రాజేష్ ఖన్నా హాజరయ్యారు. ఈ సందర్భంగా గుడిమల్ల రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. తెలంగాణ ఉద్యమకారుల న్యాయమైన హక్కుల సాధనే లక్ష్యంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదికను ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులను ఒకే వేదికపైకి తీసుకువస్తున్న గుడిమల్ల రవికుమార్ కృషిని రాజేష్ ఖన్నా ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల న్యాయమైన హక్కులు వారి డిమాండ్ల సాధనకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉద్యమకారులను సమన్వయం చేసుకుంటూ ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర పేర్కొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

పోపా ప్రతిభ అవార్డులలో తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటనారాయణ పిలుపు

వరంగల్ (వాయిస్ టుడే) అక్టోబర్ 25 : వరంగల్ ఉమ్మడి జిల్లా పోప (పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) ఆధ్వర్యంలో శివనగర్ పద్మశాలి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పోపా అవార్డు ల కార్యక్రమనికి ముఖ్య అతిథిగా తెలంగాణ అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు ప్రతిభతో ఉన్నత శిఖరాల అధిరోహించి అభివృద్ధి పథంలో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు అలాగే సంఘటితంగా రాజకీయాల్లో కూడా రాణించాలని అన్నారు. మరొక ముఖ్య అతిథి పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గూడూరు శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పద్మశాలీల నైపుణ్యత పెంచడం కొరకు ఆర్థికంగా చేయూతనియడం కొరకు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. పోపా రాష్ట్ర అధ్యక్షులు శామంతల శ్రీనివాస్ మాట్లాడుతూ, పద్మశాలి విద్యార్థులు ప్రతిభతో ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సివిల్స్ లో రాణించాలని, పేద విద్యార్థులకు తోడ్పాటు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారు సుమ్మా రావు పద్మశాలి జాతీయ ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్, డాక్టర్ కూరపాటి రమేష్డాక్టర్ మహేశ్వర్, డాక్టర్ వినోద్, సీనియర్ న్యాయవాది దుస్సా జనార్ధన్ సీనియర్ న్యాయవాది చిలక మారి వెంకటేశ్వర్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నాగరాజు గడ్డం కేశవమూర్తి పోప జిల్లా అధ్యక్షులు గుండు కామేశ్వర్ ప్రధాన కార్యదర్శి పాము శ్రీనివాస్ మాటేటి అశోక్ సంతోష్ కుమార్ కోశాధికారి బైరి శ్యాంసుందర్, ముల్కరాజు అనిల్ న్యాయవాదులు మెరుగు సుభాష్ చెన్నూరి రమేష్, గుండు రవి ప్రసాద్ రాకేష్, అవార్డ్స్ కమిటీ చైర్మన్ గోల్కొండ సుధాకర్ రెడ్ క్రాస్ చైర్మన్, వద్నాల సదానందం, తదితరులు పాల్గొన్నారు.